"పెళ్ళయ్యాక పెళ్ళాన్ని సినిమాకు తీసికెళ్ళడ మనేది ఏ అడ్డగాడిద అయినా చెయ్యగల పనే. అందులో చెప్పుకోదగ్గ గొప్పేమీ( ఏడవదు. పెళ్ళికాక ముందు... ప్రేమించిన పడతిని గాని, సంబంధం స్థిరమైన సుదతిని గాని... సినిమాలకీ, షికార్లకీ, రోడ్లమ్మటా, దొడ్లమ్మటా తిప్పడంలోనే గొప్ప థ్రిల్ ఉంటుందిరా, చలపాయ్!" అన్న గోపాలకృష్ణ పలుకులు చెవుల్లో పదే పదే ప్రతిధ్వనిస్తూ, తన మెదడుని చెదపురుగులై తినేస్తూండగా అసహనంగా అటు ప్రక్కకు దొర్లాడు చలపతి.

అక్కడ...

తలగడా ఆనరాగా మంచంమీద గోడకి ఆనించి నిలబెట్టిన కాబినెట్ సైజ్ ఫోటోలోంచి ఈస్ట్‌మన్ కలర్‌లో మూర్తీభవించిన వసంతంలా ముసిముసిగా నవ్వుతూ తనని కవ్విస్తోంది తన [illegible] రమ్య.

చటుక్కున ఆ ఫోటోని అందుకుని పెదవుల కానించుకుని, గుండె మీదకు జార్చుకుని, బరువుగా పాములా బుస్సుమని నిట్టూర్చి, 'గోపాల కిష్టిగాడికేం చిన్నప్పట్నుంచీ కలర్‌ఫుల్ లైఫ్ గడిపిన శాల్తీ. పైగా పేరున్న రచయితా, నటుడూకూడా. అభిమానులం, ఆరాధకులం అంటూ అమ్మాయిలు వాణ్ణి ముట్టుముట్టుతూనే ఉంటారు. దాంతో కొత్త ఫీలవక కాబోయే పెళ్ళాన్నెనుకుని ఏ తిరుగుళ్ళయినా తిరుగుతాడు. కానీ నేనెప్పుడూ అమ్మాయిలతో మాటాడయినా ఎరుగనే' అని బాధపడ్డాడు. బాధపడుతూనే శరీరం వైపు చూసుకున్నాడు. బనీనులోంచి తన్నుకొస్తూ, దృఢంగా ఇనప కవచంలా కనబడుతున్న తన ఛాతీని చూసుకునేసరికి ధైర్యం తన్నుకొచ్చింది. ఒక్క ఉదుటున లేచి



క్రోధన ఉగాది హాస్య కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# థ్రిల్

తులసి బాలకృష్ణ





'నువ్వు నవ్వితే లోకం నీతో నవ్వుతుంది. నువ్వేడి స్తే మాత్రం ను వ్వొక్కడివే ఏడవాలి' అన్న సూక్తి మనసులో నాటుకుపోవటం వలన హాస్య రచనలు చేయటమన్నా, చదవటమన్నా హాస్య నాటకాల్లో నటించటమన్నా గొప్ప ఇంట్రెస్టు. ఇదివరలో అందుకున్న బహుమతులతోపాటు ఈ సారి ఆంధ్రప్రభ ప్రథమ బహుమతి నిచ్చి ప్రోత్సహించటం మంచి థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ పోటీ నిర్వహించిన ఆంధ్రప్రభకి అభినందనలు. కృతజ్ఞతలు

వరంగల్ ఆంధ్రా బాంకులో ఆఫీసర్‌గా ఉంటున్నాను.



కూర్చుంటూ. 'ఛ ఛ...కాబోయే పెళ్ళాన్ని...సరదాపడి సినిమాకి తీసుకు వెళ్ళడానికి భయపడ్డమా' అనుకుని. మరి ఒక్క ఉదుటున మంచంమీంచి క్రిందకు దూకి. మళ్ళీ ఫొటోవైపు దృష్టి సారించాడు.

ఫాన్సీగా నవ్వుతూన్న ఫియాన్సీ నవ్వు మరింత ధైర్యా న్నిచ్చింది.

ఇంకేవీఁ ఆలోచించకుండా చకచకా బట్టలు మార్చుకుని. గుప్పెడు పౌడరు మొహానికి పులుముకుని. రూముకి తాళం పెట్టి. స్కూటర్ స్టార్ట్ చేసి దూకించాడు-కాబోయే మామగా రింటివైపు.

మాంఛి వేగంగా నడుస్తోంది స్కూటరు.

'ఝూన్సీ...మై ఫియాన్సీ...ఫర్ అదర్స్ నో వేకెన్సీ...లెట్ దేర్ బి ఎమర్జన్సీ' అంటూ అప్పటికప్పుడు ఇంగ్లీషులోనే కవిత్వం అల్లి పాడుకోసాగాడు. హుషారు పేట్రేగి పోతూండగా.

చినుకుల మధ్యనుంచి దూసుకుపోయే అర్జునుడి బాణంలా వాహనాలను అతి చాకచక్యంగా తప్పించుకుంటూ ముందుకు ఉరుకుతోంది స్కూటరు.

అయితే గమ్యం చేరుతూండగా అప్రయత్నంగానే వేగం తగ్గసాగింది. లోలోపల చిన్నగా దడ. సన్నటి వణుకు ప్రారంభ మవుతూన్నట్లు గమనించిన చలపతి యధాలాపంగా నుదుట పట్టిన చెమటని ఎడమచేతి చూపుడు వ్రేలితో తుడిచి రోడ్డుమీదకు వదిలాడు. మరో క్షణానికి మరింత దడ. వణుకు కలగడం. మొహమంతా చెమట ధారలు కట్టడం జరిగిపోయింది. దాంతో స్కూటర్ని మామగా రింటి వీధిలోకి తిప్పకుండా తిన్నగా ముందుకు పోనిచ్చాడు. అలా ఓ కిలోమీటర్ పోనిచ్చి, 'ఛ ఛ-బెదు రెందుకు' అనుకుని వెనక్కి తిప్పాడు. మళ్ళీ సరిగ్గా ఆ వీధి దగ్గర కొచ్చేసరికి టర్న్ చెయ్యడానికి ధైర్యం చాలక ముందుకు పోనిచ్చాడు...ఇలా మెయిన్ రోడ్డు మీదే మూ డు రౌండ్లు కొట్టాడు.

పెళ్ళికానిదే 'మీ అమ్మాయిని నాతో సినిమాకు ఎంపించండీ' అంటే పెద్దాళ్ళు పంపిస్తారో, పంపించరో?! అందులో మామగారు పది కిలోల పచ్చి మిరపకాయలు పరపర నమిలేసిన వాడిలా ఎప్పుడూ మటమటలాడుతూ ఉంటాడు. పెళ్ళి చూపుల్లో కూడా తన తండ్రి జోకులు పేలుస్తూంటే. అందరూ- ఆఖరుకి పెళ్ళికూతురు ఝాన్సీకూడా- పగలబడి మనసారా నవ్వారు కానీ. ఆయనగారు మాత్రం 'దమ్ముంటే నన్ను నవ్వించండి, చూద్దాం' అని ఛాలెంజ్ చేసిన

వాడిలాగ. 'నవ్వితే గుండు గొరిగించుకుంటా' అని ఒట్టు పెట్టుకున్న వాడిలాగ బొమ్మలా కూర్చున్నాడు. అలాంటి దుర్వాస మునీంద్రుడు...కూతుర్ని... పెళ్ళికి ముందే...'

తల వేడెక్కిపోతోంది.

భయంవేసింది. అంతలోనే పౌరుషమూ పొడుచుకొచ్చింది. గోపాల కిష్టిగాడి మాటలు గుర్తుకొచ్చి. ఉక్రోషంతో 'చూద్దాం-ఏమయితే అవుతుం'దని మామగారింటి వీధివైపు తిప్పాడు స్కూటర్ని. ఆ ఇంటికి నాలుగిళ్ళ ఇవతలే ఓ వారగా స్కూటర్ని పార్క్ చేసి. జారిపోతున్న గుండెని పైకెగదోసుకుని. రుమాలుతో మొహం అద్దుకుని. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ. అతి ప్రయత్నంమీద ముందుకు సాగాడు. ఇల్లు చేరువవుతూంటే కాళ్ళు తడబడ్డాయి. గబుక్కున నిలదొక్కుకుని. బెరుకు పోవడానికి అక్కడున్న సినిమా పోస్టరు మీద దృష్టి నిలిపాడు. గుండె దడ తగ్గడానికి అయిదు నిమిషాలు పట్టి. పోస్టరు మీది బొమ్మ ఇప్పుడు కళ్ళకు సరిగ్గా కనిపించేసరికి చచ్చేలా సిగ్గుపడ్డాడు చలపతి. అది బండబూతు టైటిల్‌తో ఉన్న మళయాళ చిత్రం పోస్టరు. అయిదు నిమిషాలపాటు చూసినా ఆ విషయం తన మెదడుకే ఎక్కలేదు. ఇంకా నయం-మామగారింట్లో వాళ్ళెవరైనా చూసుంటేఎంత అప్రతిష్ట!

ధైర్యంగా ముందుకు అడుగులయితే వేశాడుగాని. ఇంటివైపు మొహం తిప్పడానికి చాలా కష్టపడ్డాడు: ముందువైపు పెద్ద కాంపౌండు. అంతకంటే పెద్ద గేటూ ఉండి. వెనక ఎక్కడో ఉంటుంది ఆరు గదుల కొంప. ఆ కాంపౌండు నిండా రాకాసి ముళ్ళ మొక్కలూ. బ్రహ్మజెముడు డొంకలూను. ఆ గేటుని ఆ ఇల్లు కట్టిన క్రొత్తల్లో ఒకే ఒక్కసారి వేసుకుని టెస్ట్ చేసి ఉంటా రంతే. అప్పట్నుంచీ అది బార్లా తెరిచే ఉండడంతో కుక్కలూ. మేకలూ. పందులూ యదేచ్ఛగా సంచరిస్తూ ఆ మొక్కల మధ్య యుగళ గీతాలు పాడుకుంటూ గంతులేస్తూ. కొన్ని తరాలుగా స్థిర నివాసం ఏర్పరచుకుని హాపీగా జీవిస్తున్నాయి.

నెమ్మదిగా గేటు లోపలికి అడుగుపెట్టాడు చలపతి. ఏదో తప్పు చేసిన వాడిలాగ బెదురు బెదురుగా నడవసాగాడు. పందుల గుంపొకటి సకుటుంబ సపరివార బంధుమిత్ర శత్రు సమేతంగా అతనికి స్వాగతం పలికి. బిలబిలమంటూ వాహ్యాళికి తరలి వెళ్ళింది.

పెళ్ళి చూపులయి వారం అయ్యింది. ముద్దుగుమ్మ ఝాన్సీ మొదటి చూపులోనే తనకి నచ్చడం. రెప్పెత్తి తనని చూస్తూనే ఆమె చెంపలు కెంపులవడం ఒకేసారి జరిగిపోగా...తమ మనస్సులను గ్రహించిన పెద్దాళ్ళు ముహూర్తాలుకూడా నిర్ణయం చేసుకుని. తాంబూలాలు పుచ్చేసుకుని. పరపర నమిలివేశారు. 'మరో నెల్లాళ్ళలో ముహూర్తంరా. అబ్బాయ్-అందాక సీ కీ హొటల్ కూడు తప్ప'దని రైలెక్కారు అమ్మా. నాన్న. ఇంకా మూడు వారాలు! ఈ మూడు వారాల్లోనే ఎలాగలా ఝాన్సీని సినిమాకి తీసుకెళ్ళి. ఆ థ్రిల్ ఏమిటో అనుభవించితీరాలి. ఈ మూడు వారాలూ దాటితే ఈ జన్మకి ఆ ఛాన్సు పోగొట్టుకున్నట్టే. కానీ తనిప్పటివరకూ ఝాన్సీతో ఒక్క మాటయినా మాట్లాడలేదే! పైగా చచ్చేంత మొహమాటం. మామగారా... హిట్లర్ మేనల్లుడు. ఏం దారి? మళ్ళీ చలపతి కళ్ళు అతన్ని మోసగించాయి. ఆలోచిస్తూనే అతను పొదలూ. డొంకలూ దాటి ఇంటి దగ్గర కొచ్చేశాడు. వర్తమానంలో కొచ్చి ఎదురుగా చూస్తే పడక్కుర్చీలో పేపర్ చదువుతూ మామగారూ. ప్రక్కన స్టూలు మీద కూర్చుని ఏదో కుట్టుకుంటూ ఝాన్సీ కనబడ్డారు.

అదిరి పడ్డాడు చలపతి.

కానీ వాళ్ళింకా తనని చూడలేదని గమనించి. చటుక్కున ఒక పొదచాటుకు దూకాడు. సృష్టిలో ప్రతిదీ ఉపయోగకరమైనదే అన్నమాట కర్థం ఇప్పుడు తెలుస్తోంది. నిజంగా ఈ ముళ్ళ పొదే గనక ఇక్కడ లేకపోతే నా పనేంకాను? మామగారు చూడలేదు గనుక కానీ-చూసుంటే! హమ్మో! చేతిలో పేపరు పరపర చింపేసి. పళ్ళు పటపట కొరుకుతూ. ఒక చేత్తో కూతుర్ని వంటింట్లోకి. రెండోచేత్తో తనని వీధిలోకి గిరవాటేసే వాడేమో! ఇంకా నయం. వెధవ సినిమా సంగతి దేవుడెరుగు. పైగా ఇంకా మూడు వారాలుందిగా. ప్రస్తుతానికి ఇక్కడ్నుంచే చాటుగా. హాయిగా కాబోయే అర్ధాంగి అందాల్ని తనివితీరా గ్రోలుదాం అని కళ్ళు విప్పార్చి. ఊపిరి బిగబట్టి చూడసాగాడు.

తలంటుకున్న నల్లటి పదులు కురులు చంద్రబింబంలాంటి ముఖారవిందాన్ని చంద్రుణ్ణి కమ్మిన మబ్బుల్లా సగం కప్పుతూండగా. పచ్చటి పట్టు పరికిణీ. ఎర్రటి వోణీ. గులాబీ రంగు జాకెట్టు ధరించిన వెన్నెల రంగు ఝాన్సీ కనువిందు చేస్తూంటే చలపతి తన్మయుడై. మెలికలు తిరిగిపోయాడేగానీ తన వెనగ్గా. తనకు అతి చేరువలో. దాదాపు తగుల్తూ ఉన్నట్టుగా నిలబడ్డ మరో ప్రాణిని గమనించనే లేదు.

ఆ ప్రాణి చలపతిని సుతారంగా 'ఏ ఊరు మస్వీ' అన్నట్టుగా మర్యాదగా తట్టింది. గానీ. మైకంలో ఉన్న చలపతి మొహమయినా తిప్పలేదు. దాంతో తిక్కరేగి ఆ ప్రాణి పళ్ళు ఓగించి. నిలువునా పైకి లేచి. సరిగ్గా చలపతి చెవిదగ్గర నోరు పెట్టి పెద్ద ధ్వనితో 'గుర్ర్...ర్ర్...ర్ర్...' మనేసరికి. అదిరిపడ్డ చలపతి అటు తిరిగి. భయంతో బిగుసుకుపోయాడు.

'అదీ అలా రా దారికి' అన్నట్టుగా తగ్గి గుచ్చి మిటకరించి చూస్తూ. ఇప్పుడు చెప్పు ఎందుకిక్కడ దాక్కున్నావు అన్నట్టుగా ప్రశ్నించింది-ఆ మహారణ్యానికి మృగరాజుగా చెలామణీ అవుతూన్న గ్రామ సింహం.

ఒక్కసారిగా పొటమరించిన చెమటలతో చలపతి ఒళ్ళూ. బట్టలూ తడిసి ముద్దయ్యాయి. ఏ దారీ పాలుపోక రెండు చేతులూ ఎత్తి ఆ జీవికి వినయ విధేయతలతో నమస్కరించాడు గానీ. నక్క వినయాలకు లొంగడం అలవాటులేని ఆ రారాజు ఒక్కసారిగా చలపతి మీదకు లంఘించింది.

"అ...మ్మో..." అని కేకపెట్టాడు చలపతి.

అదిరిపడ్డారు దుర్వాసుడూ. ఆయన కూతురూ.

శక్తినంతా కూడగట్టుకుని. శత్రువుని వెనక్కి ఒక్క తోపుతోసి వరండాలోకి పరుగెత్తాడు చలపతి.

చలపతిని త్వరగానే గుర్తుపట్టారు తండ్రీ. కూతుళ్ళు.

అతని వెనగ్గా తరుముకొస్తూన్న శునకరాజాన్ని కోపంగా చూస్తూ. మీసాల క్రిందుగా ఒక్క ఉరుము మామగారు ఉరిమేసరికి. 'మనకి కావలసిన శాల్తీ యేనా-మరా సంగ జెప్పవేం పెద్దమనిషీ' అన్నట్టుగా చూసి. తగ్గి. తన రాజ్య సంరక్షణార్థం వెళ్ళిపోయింది అది.

అప్పుడు నెమ్మదిగా. ఆశ్చర్యంగా చూశారు మామగారు చలపతి వైపు.


చటుక్కున చూపు ఝాన్సీ వైపు తిప్పాడు చలపతి.

జరిగినదానికి బాధపడుతూన్న ఝాన్సీ. "సారీ సారీ-వెధవ డొంకలన్నీ కొట్టించెయ్యాలి. [illegible] లిన జంతువులన్నీ చేరుతున్నాయి. పాపం కదూ!" అంది.

"కూర్చోండి" అన్నారు మామగారు-తన సహజ గంభీర పోకడ సడలింతే.

లోపల్నుంచి గబగబా బయటికొచ్చిన అత్తగారూ. ఝాన్సీ తనకు సకల మర్యాదలూ చెయ్యగా తేరుకున్న చలపతి. లేచి నిలుచుని. "వస్తానండి" అన్నాడు.

"[illegible]" అన్నారు మామగారు.



"అదేమిటీ?" అంది ఝాన్సీ గబుక్కున.

"మరే-అప్పుడే వెళ్ళడమేమిటీ!భోంచేసి వెళ్దురు గాని" అంది అత్తగారు.

"లేదండీ! ఈ ప్రక్కన ఒక ఫ్రెండుని కలవడాని కొచ్చాను. అతను లేడు. ఓ పావు గంటలో వస్తాడన్నారు. ఆ రోజున మాఘగారికి కొంచెం ఒంట్లో బాగు లేదన్నారుగా. ఎలా ఉందో చూసి పోదాం అని వచ్చాను" అని అబద్ధం ఆడేశాడు చలపతి-ఝాన్సీని సినిమాకి పంపించ మనడానికి ధైర్యం సరిపోక.

"నేనేం నిత్యరోగినా? ఏదో పులవరం తగిలింది. ఒక్క రోజులో పోయింది. ఇంకా ఇప్పటివరకూ కాచుక్కూర్చుంటుందా?" అంటూ. గ్రామ సింహానికి యజమానినని నిరూపించుకుంటూ మరింతగా గుర్రుమన్నాడు మాఘగారు.

"అబ్బెబ్బే-ఆయ నుద్దేశం..."

"అర్థమయ్యింది లేవోయ్" అని భార్య మీద కస్సుమని. గేటుదాకా తోడొచ్చి దిగబెట్టారు మాఘగారు.

** ** **

రోజులు గడుస్తున్నాయి.

చలపతి కోరిక మాత్రం తీరట్లేదు. అందుకని ధైర్యమూ చిక్కడం లేదు- 'ఏం నా కాబోయే భార్యే కదా. నాతో పంపడానికేవి టభ్యంతరం' అని నిలేసి అడుగుదామంటే.

ఒక్కొక్క రోజే గడుస్తూంటే బెంగ అధికం కాజొచ్చింది.

ఒకటి రెండుసార్లు తెగించి అడుగుదాం అని డ్రస్సు వేసుకుని బయల్దేరి. విరమించుకుని. వాజమ్మలా ముసుగు తన్ని రూములోనే పడుకున్న రోజులూ ఉన్నాయి.

ఈరోజు.....

రోజూ లాగే తీరని కోరికతో కుమిలిపోతూ. ముసుగు తన్ని పడుకున్న చలపతి-తలుపు మీద టకటక కొట్టిన శబ్దం. దాంతో బాటే చిన్నగా గాజుల గలగలా వినిపించేసరికి. ఉలిక్కిపడి. "ఎవరూ" అన్నాడు చిరాగ్గా.

జవాబు లేదు. మళ్ళీ ముసుగు తన్నాడు చలపతి.

మరో నిమిషానికి మళ్ళీ 'టకటక'. గాజుల సవ్వడి.

చిరాగ్గా తటాలున లేచి. దుప్పటీని ఉండ జుట్టి మూలకు గిరవాటేసి. దభీమని తలుపులు తెరచి. భయంకరంగా చూస్తూ...... వెల్లవేసిన మనిషిలా తెల్లబోయాడు చలపతి.

ఎదురుగా...లేత గులాబీ రంగు చీరలో- తలలో ఒకే ఒక్క గులాబీ పువ్వుని తురుముకుని. సుసుతేత సిగ్గుల దొంతరలలో ఒక ప్రక్కగా ఒరిగి. పంచీ వంచని ముఖార విందంతో. మూసి మూయని కనురెప్పలతో...గులాబీ బాల... ఝాన్సీ!

చలపతి హృదయం ఝుల్లుమంది. అమాంతం ఆమెను హృదయానికి బలంగా హత్తుకుని. గిరగిరా తిప్పాలన్న ఆవేశం వచ్చి మరుక్షణం చప్పబడి పోయింది. ఇది కలా? నిజమా? కల అయితే నిరాశ. నిజమయితే...?హమ్మో! ఇంటావిడ చూసిందంటే ఇంకేమయినా ఉందా? సొంత పెళ్ళాంతో కాపురం చేస్తున్న వాళ్ళనే అనుమానించే రకం. గబుక్కున అలవాటు ప్రకారం చెమటలు పోశాయి: గాభరా పడ్డాడు.

"లోపలకు రండి... రండి" అన్నాడు. మళ్ళీ అంతలోనే. "వద్దులెండి-నేనే బయటకొస్తా" అని గొణిగాడు గొంతు తగ్గించి. మళ్ళీ ఏమనుకున్నాడే. "కాదు లెండి మీరే వచ్చేయండి లోపలికి" అన్నాడు తొందరపెడుతూ.

ఆమె హంస గమనంతో క్రొత్త కాపురంలో అడుగు పెడ్తూన్న సరిక్రొత్త పెళ్ళి కూతుర్లా నెమ్మదిగా లోపల కొస్తూంటే "త్వరగా" అని తొందరపెట్టి. ఆమె లోపల కొస్తూనే తలుపులు బిడాయించి. చటుక్కున ఆమె తనవైపు చూడటంతో ఖంగుతిని. గబుక్కున తలుపులు తెరచి గుమ్మానికి నిండుగా అడ్డంగా నిలుచుని. 'కూర్చోం' డన్నాడు- రహస్యం చెబుతున్నట్లు కుర్చీవైపు సైగచేసి చూపించి.

మూలనున్న కుర్చీని ఆమె బయటకు లాగబోతూంటే. "అహాఁహాఁ... అక్కడే కూర్చోండి" అన్నాడు. చెమట తువ్వాలుతో తుడుచుకుంటూ.

ఆమె సిగ్గు నుంచి తేరుకుంటూ. కుర్చీలో కూర్చుని. "ఎందుకో... గాభరా పడుతున్నారు. నేను రావడం... ఏవీఁ ఇబ్బంది కాదు కదా?" అంది వీణ మీటినట్లు.

"అబ్బెబ్బే అదేంలే" దంటూ బిడియ పడ్డాడు చలపతి. ఆడపిల్లకున్న పాటి ధైర్యం తనకు కలగడం లేదని తనని తనే చివాట్లు వేసుకున్నాడు.

"ఆ రోజు వచ్చారు మా ఇంటికి-మళ్ళీ రాలేదేం?"

"ఊరికే. తీరిక దొరక్క..." నవ్వు లాంటి ధ్వని చేశాడు చలపతి.

"ఆ పాడు కుక్కని కర్రతో బాది తరిమేశాను."

"పాపం."

"ఆఁ?!"

"అదే పాపం-శ్రమ తీసుకున్నారు మీరు?"

"మీకు ఒక్కరికీ ఎలా తోస్తుంది ఈ రూములో?"

"ఏవుందీ-బుక్స్" అంటూ ఒక్క పుస్తక మయినా కనబడ్తుందేమోనని చుట్టూ చూశాడు.

ఝాన్సీ నవ్వాపుకుంటూ. "మీకు బోరుగా ఉంటుందేమో-కబుర్లు చెపుదామని వచ్చాను" అంది.

"థాంక్స్."

"ఏమయినా కబుర్లు చెప్పండి."

"హిహి... ఏముంటాయి?"-ఇంకా ధైర్యం చిక్కడం లేదు. ఖర్మ!

చిన్నబుచ్చుకుని ఝాన్సీ. మళ్ళీ హుషారు తెచ్చుకుని. "పోనీ ఏదయినా సినిమాకి పోదామా?" అనేసరికి. ప్రక్కన బాంబు పడ్డట్టు అదిరిపడి. "ఏమన్నారూ?" అన్నాడు చలపతి తడబడుతూ.

తెల్లబోయిన ఝాన్సీ. "అదేవిటీ... అలా కంగారూ పడ్డారూ?" అంది.

"అబ్బెబ్బే...కం...కంగారే ముందండీ...ఆ...ఆనందం. అవునూ-మీ రేవిఁ టన్నారూ?"

"ఏదయినా సినిమాకి పోదామా అన్నాను."

మూర్ఛ వచ్చినంత పనయి. అలాగే గుడ్లు మిటకరించి చూస్తున్నాడు చలపతి.

"పోనీ మీకేమయినా పనుంటే వద్దులెండి" అంది చిన్నబుచ్చుకుని.

"అబ్బెబ్బే-పోదాం" అన్నాడు ధైర్యంగా.

"సరే అయితే-తయారవ్వండి" అని లేచి. రూము బయటకు పోయి నిల్చుంది.

ఒక్క రెండు నిమిషాల్లో తయారయి. రూముకి తాళం పెట్టి. "ఏ సినిమాకి వెళ్దామంటారూ" అన్నాడు తడబడకుండా ప్రయత్నించి.

"సినిమాల వీధికి పోదాం-ఏదో ఒకాటి చూడొచ్చు."

"సరే-మీరు రిక్షాలో వస్తారా?"

విస్తుపోయి చూసింది ఝాన్సీ.

సిగ్గు పడిపోయాడు చలపతి.

"ఇంకా నయం-రేపొద్దున్న పెళ్ళయ్యాక హనీమూన్‌కి ఇద్దరం చెరో చోటికీ వెళ్దామనరు కదా?" అంటూ ఫక్కున నవ్వింది.

"అబ్బెబ్బే... నా ఉద్దేశం అది కాదూ... రిక్షాలో వెళ్దామా..."

"నిక్షేపం లాంటి స్కూటర్ని పెట్టుకుని రిక్షా ఏమిటండీ... స్టార్ట్ చేయండి" అని ఆర్డర్ వేసింది-అతగాడి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న ధైర్యంతో.

ఏమనాలో తోచక. "అదే...అదే" అని నవ్వి. స్కూటర్ స్టార్టు చేసి. బాగా ముందుకి జరిగి



ఇబ్బందిగా కూర్చున్నాడు.

వెనక సీటు మీద ఛంగున ఎక్కి కూర్చుని. "పోనీండి" అంది.

ఇంటావిడ కంట పడనందుకు తెగ సంబరపడిపోతూ. 'బ్రతుకుజీవుడా' అని. అరవైలో ముందు కురికించాడు గానీ. వెనక నుంచి సుతారంగా తన పొట్టని చుట్టుకుంటూన్న సున్నితమయిన మెత్తటి చేతిని గమనిస్తూనే మెలికలు తిరిగిపోయి. చొక్కాలో ఎలకపిల్ల దూరిన వాడిలాగ కిచకిచ లాడుతూ. క్షణంలో బండిని కంట్రోల్ చేసి. బ్రేక్ కొట్టి ఆపు చేసేశాడు.

"అదేం? అంది ఝాన్సీ."

"హిహి...నాకు...కితకితలు" అన్నాడు మొహమ్మాట పడ్తూ.

"మరయితే కొంచెం నెమ్మదిగా పోనీండి. ఎవరో తరుముకొస్తూన్నట్లు అంత ఫాస్టెందుకూ? అంత ఫాస్టులో మిమ్మల్ని పట్టుకోకపోతే క్రింద పడనూ?"

"నిజమే" అన్నాడు. వేగం తగ్గించి నడపసాగడు. బాధపడ్తూనే. అతను వేగంగా నడపడంలో ముఖ్యోద్దేశం తామిద్దరూ ఎవరికంటా పడకూడదని. ఎవరూ తమని గుర్తు పట్టకూడదని. గుర్తుపడ్తే తను తలెత్తుకోలేడు. అందులో ఈ పిల్ల తండ్రికి చెప్పి వచ్చిందో. లేదో? ఈ విషయం అతగాడికి తెలిస్తే తనని నిలువునా పాతేస్తాడు. స్కూటరొద్దన్నా. సినిమావద్దన్నా తనని వాజమ్మలా జమకట్టేలా ఉందీ పిల్ల. పైగా తను కోరుకున్న అవకాశం జారవిడుచుకుంటే తనూ పూలయి పోతాడు. ఏం పరిస్థితిరా దేవుడా?

బాగా ఖాళీగా ఉన్న సినిమా హాలు దగ్గర స్కూటరాపి. స్టాండులో పెట్టి. ఆమెకు దూరంగా నడుస్తూ కౌంటర్లో టిక్కెట్లు తీసుకుని గబగబా హాల్లోకి నడిచాడు. అతన్ని అందుకోవడమే కష్టమయ్యింది ఆమెకి. చీకట్లో కళ్ళు పొడుచుకు చూస్తూ. దూరంగా పోతూన్న అతణ్ణి అనుసరిస్తూ. ఏ సీనో సినట్లు ఓ మూలగా కూర్చున్న చలపతి ప్రక్క సీట్లో బైఠాయించి. "నన్ను మరిచిపోయారా" అంది గోముగా.

"ఛఛచ అదేం లేదు- సినిమా స్టార్టయిపోయింది కదూ. నెమ్మదిగా నడిస్తే చూస్తూన్న వాళ్ళకి అడ్డమని- అంతే" అని నవ్వాడు.

కబుర్లేవీ చెప్పకుండా సినిమాచూస్తున్న చలపతిని చూస్తే ఝాన్సీకి ఉడుకు మోత్తనం కలిగింది గాని నిభాయించుకుంది.

అప్రయత్నంగా చేస్తున్నట్లు అతని కాలి వేళ్ళను తొక్కింది కానీ. చటుక్కున కాలు వెనక్కిలాక్కున్నాడు చలపతి.

'విశ్రాంతి!'

బయటకు వెళ్ళి కాఫీ తాగొద్దాం అంటాడేమోనని ఎదురు చూసింది. అలా అనలేదు సరికదా సీట్లో కిందకు జారిపోయి. టిక్కెట్టు కొనని వాడిలాగ దాక్కున్నట్లు కూర్చున్నాడు చలపతి.

మళ్ళీ సినిమా ప్రారంభమయ్యింది.

"కబుర్లేం చెప్పటం లేదేం!" అంది. బుంగమూతి పెట్టి.

"సినిమా బాగుంది కదా-చూస్తున్నాను."

ఒళ్ళు మండింది ఝాన్సీకి. 'ఇంకీ మనిషి కబుర్లూ చెప్పడు. చిలిపి పనులూ చెయ్యడూ' అని అర్థం చేసుకుని. సినిమా అయినా ఎంజాయ్ చేద్దాం అని నిర్ణయించుకుని. దృష్టి తెరమీద నిలిపింది.

కోరిక తీరిన తృప్తికీ. మామగారికి తెలిస్తే జరగబోయే మారణహోమానికీ మధ్య చలపతి మెదడులో ఘోరమైన యుద్ధం జరుగుతోంది.

సినిమాలో ఓ హాస్య సన్నివేశానికి స్వేచ్ఛగా నవ్వుతూ. చలపతి చేతిమీద ఛళ్ళున చరిచింది ఝాన్సీ ఒళ్ళు మరిచి.

"అమ్మా!" అని మూలిగాడు చలపతి బాధగా.

"అయ్యో. సారీ అండీ."

"అc... మరేం ఫర్వాలేదు. నిన్న రాత్రి నిద్దట్లో బెణికింది ఈ చెయ్యి. దాంతో కొంచెం నొప్పిగా ఉంది."

"అలాగా-మరి స్కూటరెలా నడిపారు పాపం" అంది జాలిగా.

"అల్లాగే-తప్పదుగా" అన్నాడు గుండెల్లో ఉబికిన ఉత్సాహంతో.

సినిమా అయిపోయింది.

ఇందాక లోపలి కొచ్చినంత వేగంగానూ. ముందుగానే బయటకు పరుగెత్తాడు చలపతి.

స్కూటర్ తాళం తీసి. స్టాండు తీస్తూండగా వెనక నుంచి వచ్చిన ఝాన్సీ. "మీ చెయ్యి నొప్పిగా ఉందన్నారుగా పాపం-ప్రక్కకు రండి" అనేసరికి తెల్లబోయి. "అదేవిటండీ-నేను ప్రక్కకొస్తే..." అని చలపతి అంటూండగానే. ఓరనవ్వుతో. "నేను నడుపుతాను స్కూటరు" అంది.

నిశ్చేష్టుడయ్యి పోయి. "మీరు..."

"ఆహా...నే...నే..." అంటూ తేలిగ్గా నవ్వి. ఒక్క కిక్కులో స్టార్టు చేసి. ముందు సీటు మీద కూర్చుని. "ఎక్కండి" అంది.

కనురెప్పలు వాల్చడం మరిచిపోయిన చలపతి కీ ఇచ్చిన బొమ్మలా వెనక సీటు మీద దూరంగా స్టెప్నీకి అంటుపోయి కూర్చున్నాడు గానీ. ఆమె నడుపుతూన్న వేగానికి మూడుసార్లు తుళ్ళి ఆమె మీద పడ్డాడు.

"ఎందుకంత అవస్థ పడ్తారూ—నన్ను పట్టుకోండీ" అని అజమాయిషీగా అని. "నాకేం కితకితలు లేవు. సార్" అంటూ కిలకిలా నవ్వింది.

గత్యంతరం లేక ఆమెని పొదివి పట్టుకుని. జరుగుతున్నది కలా. నిజమా అనే సందిగ్ధంలో నుంచి తేరుకోకుండానే తన రూముకి చేరుకున్నట్లు గమనించిన చలపతి స్కూటర్ దిగుతూ. రూము గుమ్మం వైపు చూస్తూనే... ఎండుటాకులా గజగజ వణికి పోయాడు—గుమ్మాని కడ్డంగా. నిలువుగా హిట్లరులా నిలబడి ఉన్నాడు మామగారు!

"న...న్నమస్కారమండీ... సినిమా హాల్లో...అహc...బజార్లో తను కనబడ్తే...నేను...తనే నన్ను...అసలూ..."

"నో ఎక్స్ప్లెనేషన్స్, ఇంక మీ పెళ్ళికి పదిహేను రోజులే ఉన్నాయి తెలుసా?" ఉరిమాడు మామగారు.

"అదేనండీ-ఈ పదిహేను రోజులూ అయ్యాకే మీ అమ్మాయిని..."

"ఛఛభ" కట్ చేశారు మామగారు.... పెళ్ళయాక అది నీ పెళ్ళామవుతుంది. అప్పుడు సినిమాకు తీసుకు వెళ్ళడంలో థ్రిల్ ఏముంటుంది?! పెళ్ళికాకముందే అమ్మాయి. అబ్బాయి ఛడామడా తిరిగెయ్యాలి. నీకేం ఆ సరదా ఉన్నట్లుగా కనబడటం లేదు నాకు మరి. అందుకే అమ్మాయిని నేనే పంపించాను. ఈ పదిహేను రోజులూ మీ ఇష్టారాజ్యం. ఈ ఊళ్ళో ఏ సందులో. గొందులో. పార్కులో. సినిమాహాల్లో చూసినా మీరే కనబడాలి. మీరు భార్యాభర్తలు కాబోతూన్నారని తెలియని వాళ్ళంతా కుళ్ళి కుళ్ళి చావాలి. చెబుతున్నాను- కనీసం ఓ ముప్పయి కంప్లయింట్సయినా నాకందాలి. అదీ థ్రిల్లంటే-తరవాత మీ ఇష్టం" అంటూ వార్నింగిచ్చి. తనకు గుడ్నైట్ చెప్తూన్న ఝాన్సీని భుజం చుట్టూ చెయ్యివేసి తీసుకు వెళ్తూన్న మామగారిని... శాపగ్రస్తుడయి శిలా ప్రతిమయిపోయిన జానపద కథానాయకుడిలా చేష్టలుడిగి. గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు చలపతి.

*

